క్లుప్తంగా

మల్లన్న కల్యాణ మహోత్సవానికి ఆహ్వానం



జనగామ: ఈనెల 29వ తేదీన జరుగనున్న కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ ఆలయ ఈఓ బాలాజీ, అర్చకులు బుధవారం హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఎమ్మెల్యేకు వేదాశీర్వచనం అందించి శాలువాతో సత్కరించారు. ఆలయ నిర్వాహకుడు మనోహర్ తదితరులు ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడికి..



ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లిఖార్జున స్వామి కల్యాణమహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ఆలయ కార్య నిర్వహణాధికారి బాలాజీ, అర్చక బృందం ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం కొమ్మూరి దంపతులకు ఆశీర్వచనం అందించారు.

విరాళం



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామంలో యాదవ సంఘం(ఎడమ) ఆధ్వర్యంలో నిర్మించనున్న మల్లన్నదేవుడి గుడి నిర్మాణం కోసం గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి బుధవారం రూ.50వేల విరాళం అందజేశారు. నాయకులు ఎడమ కట్టమల్లు, బర్మ మల్లేశం, మారపాక రాములు, ఎడమ గట్టయ్య, బుచ్చి కొమురయ్య, మేకల సమ్మయ్య, మారపాక సంపత్ తదితరులు ఉన్నారు.

సీపీఎంను ఆదరించండి

● పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: అనునిత్యం పేదలపక్షపాతిగా ప్రజాపోరాటాలు నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే సీపీఎంను ప్రజలు ఆదరించాలని పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి కోరారు. ఈనెల 27, 28వ తేదీల్లో నిర్వహించనున్న పార్టీ జిల్లా మహాసభల నేపథ్యంలో బుధవారం ఘన్‌పూర్ పట్టణంలో ఇంటింటా క్యాంపెయిన్ చేపట్టారు. రాపర్తి రాజు, ఇర్రి అహల్య, రాపర్తి సోమయ్య, బొట్ల శేఖర్, మండల కార్యదర్శి మునిగెల రమేష్, బూడిద గోపి, యాకయ్య, విజేందర్ పాల్గొన్నారు.

సీపీఎంలో చేరిక

జనగామ రూరల్: మండలంలోని శామీర్‌పేట గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు విద్యార్థి సంఘ నాయకుడు ధర్మభిక్షం ఆధ్వర్యంలో బుధవారం సీపీఎంలో చేరారు. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబారాజు యాదగిరి, ఇర్రి అహల్య, జిల్లా కమిటీ సభ్యుడు జోగు ప్రకాశ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ సీపీఎం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. తాండ్ర సాయిలు, సాల్మన్ రాజ్, నర్సిరెడ్డి, అనిల్, అఖిల్, మహేష్, ప్రేమలత యాదమ్మ సాప్పమ్మ, జార్జి ఉన్నారు.

'పార్టీని బలోపేతం చేయాలి'

కొడకండ్ల: బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసేందు కోసం బూత్ కమిటీలను నియమిస్తున్నట్లు బీజేపీ జిల్లా నాయకుడు దొంగరి మహేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన బూత్ కమిటీల ఎన్నికలో ఆయన పాల్గొని మాట్లాడారు. పనిచేసే సాధారణ కార్యకర్తకు కూడా బీజేపీలో గుర్తింపు ఉంటుందని, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తూ వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో బలమైన శక్తిగా బీజేపీని తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. నూతనంగా ఎన్నికైన బూత్ అధ్యక్షుడు వల్లపు మహేష్, ఉప్పల మహేష్‌లకు నియామక పత్రాలను ఆయన అందజేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి సోమన్న, శ్రీనివాస్, ఆంజనేయులు, రామకృష్ణ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

'సర్పంచ్‌లను మోసం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే'

బచ్చన్నపేట: రాష్ట్రంలో సర్పంచ్‌లను మోసం చేసి వారి ఆత్మహత్యలకు కారణమైంది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు పిన్నింటి కావ్యరెడ్డి అన్నారు. బుధవారం బచ్చన్నపేటలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన విధంగా ఏడాదిలో ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజా ప్రభుత్వం అని నిరూపించుకుందన్నారు. రానున్న రోజుల్లో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలువనుందని చెప్పారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ చేస్తానని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేర్యాల ప్రజల ఓట్లు దండుకుని మోసం చేశారని అన్నారు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సహకారంతోనే చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధ్యమవుతుందని తెలిపారు.

పొగమంచుతో అధిక ప్రమాదాలు

● రాత్రి పూట ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి
● జైపాల్‌రెడ్డి, సీనియర్ ఎంవీఐ, వరంగల్ ఆర్టీఏ





ఖిలా వరంగల్: ప్రస్తుతం విపరీతమైన చలితోపాటు పొగ మంచు కురుస్తోంది. రహదారులను కమ్మేస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫాగ్ లైట్లు వాడితే 25మీటర్ల వరకు స్పష్టంగా చూడొచ్చు. నాలుగు చక్రాల వాహనం ఒకే లైటుతో ప్రయాణిస్తే ఎదురుగా వచ్చే వారు ద్విచక్ర వాహనమనుకుని, పక్కనుంచే వెళ్లే అవకాశం ఉంది. రెండు హెడ్‌లైట్లు డిప్ చేస్తూ ప్రయాణించాలి. మూలమలుపుల వద్ద అతివేగం పనికి రాదు. వాహనాలను ఓవర్‌టేక్ చేయడం వల్ల ఎదురుగా వచ్చేవి కనిపించవు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి వెనుక లైట్లు వెలిగేలా చూసుకోవాలి. పొగ మంచులో కాంతి పరావర్తనం చెంది ఎదురు వాహనాలు కనిపించవు. వాహనానికి ముందు, వెనుక రేడియం స్టిక్కర్లు అతికించాలి. రహదారిని చూడగలిగే పరిస్థితులకు అనుగుణంగా వాహన వేగం ఉండాలి. ఇతర వాహనదారులు తమను గమనించేలా హజార్డ్ లైట్ వాడాలి. లోబీమ్ ఫాగ్ లైట్లు ఉండేలా చూడాలి. నేషనల్ హైవే, శివారు రహదారులపై వాహనాల మధ్య కచ్చితంగా దూరం పాటించాలి.

చిప్‌లు గట్టిపడి పనితనం మందగిస్తుంది

● మంచుకురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ ఉపయోగించొద్దు
● మయూర్, ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్, హనుమకొండ





హన్మకొండ చౌరస్తా: ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలలో పడిపోయినప్పుడు కంప్యూటర్లు, మొబైళ్లు, బ్యాటరీ, ప్రోగ్రామబుల్ లాజిక్ కంట్రోలర్లలో ఉండే మెటల్ కాంట్రాక్ట్‌లు ప్రభావితం అవుతాయి. ఎలక్ట్రానిక్స్ వస్తువుల లోపల ఉండే చిప్‌లు మైనస్ టెంపరేచర్‌లో గట్టిపడి పనితనం మందగిస్తుంది. అయితే బయటి దేశాలతో పోల్చితే ముఖ్యంగా తెలంగాణ ప్రాంతాల్లోని చలితీవ్రత చాలా తక్కువగా ఉంటుందని చెప్పొచ్చు. దీని వల్ల ఎలక్ట్రానిక్స్ వస్తువులపై అంతగా ప్రభావం ఉండదు. అలాగని మంచు కురిసే సమయంలో బయటి ప్రదేశాల్లో ల్యాప్‌టాప్, మొబైళ్లను వాడితే తెలియకుండానే మంచు లోపలికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. నీటి తడితో విడిభాగాలు పూర్తిగా పాడవుతాయి. మంచు కురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ వస్తువుల వినియోగాన్ని తగ్గించడం మంచిది. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు కంప్యూటర్లు, మొబైళ్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువుల విడి భాగాలపైన కొంత ప్రభావం చూపుతుంది తప్పితే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్‌పై ఎలాంటి ప్రభావం ఉండదు. కీప్యాడ్ మొబైళ్లు కొంత బిగుసుకుపోయే అవకాశం ఉంటుంది. ఇప్పుడంతా స్మార్ట్ ప్రపంచం. మొబైల్ బాగా వేడి అయినప్పుడు స్విచ్‌ఆఫ్ చేయడం మంచిది.

క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలి

● జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పోగుల సారంగపాణి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చైర్మన్ సారంగపాణి

స్టేషన్‌ఘన్‌పూర్: పోటీల్లో గెలుపు, ఓటములు సహజం.. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పోగుల సారంగపాణి అన్నారు. ఛాగల్లు గ్రామంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ ఎంపిక పోటీల సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు, శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం పెంపొందుతాయన్నారు. ప్రస్తుతం కబడ్డీ క్రీడకు విశేష ఆదరణ ఉందని, ఇందులో రాణిస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అనంతరం పోటీలు అతిథులు తిలకించారు. కార్యక్రమంలో ఎంఈఓ కొమురయ్య, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి తోటకూరి గట్టయ్య, ఉపాధ్యక్షుడు నరేందర్‌గౌడ్, తోటకూరి వెంకటేశ్వర్లు, రవికుమార్, ఇంజపురి హరీష్, సమ్మయ్య, అన్నెపు కుమార్, రాజు, పొన్న రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

● డీసీపీ బి.రాజమహేంద్రనాయక్



రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

పాలకుర్తి టౌన్: శాంతి భద్రత పరిరక్షణకు పోలీసులు కృషి చేయాలని జనగామ వెస్ట్ జోన్ డీసీపీ బి.రాజమహేంద్రనాయక్ అన్నారు. పాలకుర్తి సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. రిజిస్టర్ నిర్వహణ, కేసుల విచారణపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ స్టేషన్‌కు బాధితులు వచ్చి ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించాలన్నారు. స్టేషన్‌లో కేసులు పెండిగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, ఎస్సైలు దూలం పవన్‌కుమార్, లింగారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కస్తూర్బా టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

● ఎస్ఎఫ్ఐ నాయకులు



రాస్తారోకో చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థినులు

జఫర్‌గఢ్: కస్తూర్బా విద్యాలయాల్లో పనిచేస్తున్న టీచర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్ర శివారు సాగరం క్రాస్ రోడ్డు వద్ద నాయకులు, విద్యార్థినులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. విద్యార్థినులు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి సిరికొండ అర్జున్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి కస్తూర్బా విద్యాలయాల్లో పనిచేస్తున్న టీచర్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటి వరకు వారిని రెగ్యులర్ చేయలేదని, వేతనాలు పెంచకపోగా నెల నెలా జీతాలు సక్రమంగా చెల్లించడం లేదన్నారు. దీంతో టీచర్లు కొద్ది రోజుల నుంచి సమ్మె బాట పట్టడంతో విద్యాబోధన జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాగా, నిరసనకు సీపీఎం నాయకులు సంఘీబావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, రాజు, రాహుల్, భరత్, సౌమ్య, తేజశ్రీ, కే సౌమ్య సీపీఎం మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, కాట సుధాకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

శబరికి తరలిన అయ్యప్పస్వాములు

దేవరుప్పుల: 41 రోజులు నిష్ఠతో దీక్ష బూనిన మాలధారులు అయ్యప్ప నామస్మరణంతో ప్రదర్శన చేసి ఇరుముడులతో శబరిమలైకి తరలివెళ్లారు. బుధవారం మండల కేంద్రంలోని బస్‌స్టేజీ కాలనీలో 22 మంది అయ్యప్పభక్తులు గురుస్వాముల పర్యవేక్షణలో ప్రత్యేక అభిషేకం పూజలు కుటుంబ, బంధుమిత్రుల ఆశీర్వచనాలతో ఇరుముడులు కట్టుకున్నారు.

'చలో రాజ్‌భవన్'..

జనగామ: సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు తలపెట్టిన చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ డీసీసీబీ డైరెక్టర్, హైదరాబాద్ గ్రంథాలయ చైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తరలివెళ్లారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నియామకం

కొడకండ్ల: గౌడజన హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొడకండ్ల మండలకేంద్రానికి చెందిన నర్మెట్ట శ్రీనివాస్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు నియామక ఉత్తర్వులను రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎలికట్టె విజయ్‌కుమార్, మూల వెంకటేశ్వర్లు బుధవారం అందజేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ జిల్లాలోని మండల, గ్రామ స్థాయిలో కమిటీలు నియమించి గౌడ కులస్తుల సంక్షేమానికి నిరంతరం పని చేస్తానని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బాలరాజు

బచ్చన్నపేట: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం సహాయ కార్యదర్శిగా మండలానికి చెందిన గుర్రపు బాలరాజు నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని హరిహర కళాభవనంలో బుధవారం ఆయన ప్రమాణ స్వీకారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి తనవంతు కృషిచేస్తానన్నారు. రాపెల్లి వెంకటేశ్వర్లు, మచ్చ నరేందర్, గణపురం వెంకటేష్, మచ్చ నగేష్, మురళి పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక

తరిగొప్పుల: మండలంలోని సోలిపూర్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ నూతన గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా ఎనుగుల బాపురాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, మండల ఎన్నికల అధికారి శోభన బోయిన శివరాజ్ యాదవ, రాంనర్సింహారెడ్డి, బండ ప్రసాద్, రాంబ్రహ్మాచారి, రాజు పాల్గొన్నారు.

పద్మశాలి సేవా సంఘం..

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ గ్రామంలో భక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం గ్రామ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండు రాంప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికకాగా ఉపాధ్యక్షులుగా పసునూరి సదానందం, సెక్రటరీగా పసునూరి నాగయ్యతోపాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

బాధ్యతల స్వీకరణ

చిల్పూరు: అంతర్గత బదిలీల్లో భాగంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి నూతన ఎంఆర్ఐగా చీకటి వినీత్, ఏఆర్ఐగా మనోజ్ నియమితులయ్యారు. కాగా, వారు తహసీల్దార్ సరస్వతి నుంచి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఎంఆర్ఐ కల్వల శ్రీనివాస్ సీనియర్ అసిస్టెంట్‌గా కొనసాగనున్నారు.

'రైస్ మిల్లు దుమ్ము సమస్యను పరిష్కరించాలి'

పాలకుర్తి టౌన్: మండలంలోని ఈరవెన్ను గ్రామంలో రైస్ మిల్లు నుంచి వచ్చే దుమ్మూధూళితో ఇబ్బంది పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు నల్ల నర్సిరెడ్డి, పసునూరి పుష్ప, నల్ల చిన్న నాగయ్య, మాచెర్ల ఇస్తారి, కిషన్, బిట్లు, రఘపతి, సునీల్ పాల్గొన్నారు.

నివాళి

రఘునాథపల్లి: కోడూర్ మాజీ సర్పంచ్ దుబ్బాక చంద్రయ్య (55) ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం విదితమే. కాగా, బుధవారం కోడూర్‌లో జరిగిన దశదిన కర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, వివిధ పార్టీల నాయకులు పాల్గొని చంద్రయ్య చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. మృతుడి కుమారుడు దుబ్బాక అజీత్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను బాధ్యతగా చేపట్టాలి

● అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



స్టేషన్‌ఘన్‌పూర్: సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



జనగామ రూరల్: వెంకిర్యాలలో.. అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



పాలకుర్తి టౌన్: పాలకుర్తిలో.. ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా, బాధ్యతగా చేపట్టాలని రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజలు చేసుకున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా స్టేషన్‌ఘన్‌పూర్‌లో బుధవారం అధికారులు చేపడుతున్న సర్వేను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న అధికారులకు తగిన సలహాలు, సూచనలు అందించారు. ఎంపీడీఓ విజయశ్రీ, పంచాయతీ కార్యదర్శి సీహెచ్.లింగయ్య, శ్రీనివాస్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలను పక్కాగా నమోదు చేయాలి

జనగామ రూరల్: దరఖాస్తుదారుల వివరాలను యాప్‌లో పక్కాగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాటు జరగకుండా చూసుకోవాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. వెంకిర్యాల గ్రామ పంచాయతీ పరిధిలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోకల జమున, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా నిర్వహించాలి

పాలకుర్తి టౌన్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తప్పులు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు, ఆర్ఐ రాకేష్, జీపీ కార్యదర్శి వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

లింగాలఘణపురం: ఈ నెల 29న జిల్లా కేంద్రంలో జరిగే తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి (టీఆర్ఆర్ఎస్) 3వ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను బుధవారం మండల కేంద్రంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏదునూరి వీరయ్య, జిల్లా అధ్యక్షుడు ఏదునూరి నరేశ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, మహిళ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మ, వీరయ్య, మల్లేశం, లింగరాజు, నర్సింహులు, బాలయ్య ఉపేందర్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

జనగామ రూరల్: ఈనెల 23, 24, 25తేదీల్లో సిద్దిపేటలో నిర్వహించే ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ తోట హృతిక్ సాయి పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నితీష్, అనిల్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అడిగితే అరెస్టులా..



వినతిపత్రం ఇస్తున్న జీపీ కార్మికులు

● సీఐటీయూ(జీపీ) జిల్లా అధ్యక్షుడు వెంకన్న

దేవరుప్పుల : కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అడిగితే అరెస్టు చేస్తారా అని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ఆందోళనకు వెళ్లే పంచాయతీ కార్మికుల అరెస్టును నిరసిస్తూ.. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దా కార్యాలయం వరకూ జీపీ కార్మికులు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, సూపరింటెండెంట్ పుష్పలతకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం దాటవేత ధోరణితో కాలయాపన చేస్తే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయపరమైన హక్కులు అమలు చేస్తామని ఆచరణలో విస్మరిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బస్వ రామచంద్రు, ఎడెల్లి వెంకట్‌రెడ్డి, ఉత్తెపు అయిలయ్య, మాచర్ల బిక్షపతి, మడికొండ నర్సింహ, రమణ, లావణ్య, జయమ్మ, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలి

● ఎస్సై ఊర సృజన్‌కుమార్

దేవరుప్పుల: సెల్‌ఫోన్ వినియోగంపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఊర సృజన్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్న యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లికి చెందిన మల్లేష్‌కు సీఈఐఆర్ ద్వారా లభించిన మొబైల్‌ను ఆయన అప్పగించారు. సెల్‌ఫోన్ కోనుగోలు ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండడమేగాక ప్రయాణించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అపరిచితులు కాల్స్, వాట్సాప్ మెసేజీలకు స్పందించి తమ బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. ఏఎస్సై సదానందం, కానిస్టేబుల్ యాకూబ్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

తాళం వేసిన ఇంట్లో చోరీ



వివరాలు సేకరిస్తున్న సీఐ

పాలకుర్తి టౌన్: ఇంటికి వేసిన తాళం పగులగొట్టి బంగారం, నగదు దొంగలు చోరీకి పాల్పగిన ఘటన పాలకుర్తి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడ లలిత హనుమకొండలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తోంది. ఈనెల 11న హనుమకొండకు వెళ్లింది. అక్కడి నుంచి బంధువుల ఇంటికి వెళ్లి బుధవారం పాలకుర్తికి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి ఉంది. అందులో ఉన్న 30 తులాల బంగారం, వెండివస్తువుల తోపాటు రూ. 50 వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూలం పవన్‌కుమార్ తెలిపారు. చోరీ జరిగిన ఇంటిని క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో పాటు పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి పరిశీలించారు.

బెల్లం వ్యాపారి బైండోవర్

కొడకండ్ల: సూర్యాపేట జిల్లా తిర్మలగిరికి చెందిన సోమ రమేష్ మండలంలో నాటుసారా తయారికి ఉపయోగించే నల్లబెల్లం, పటికలను విక్రయిస్తుండగా పాలకుర్తి ఎక్సైజ్ ఎస్సై పద్మ అదుపులోకి తీసుకొని బుధవారం తహసీల్దార్ కోల చంద్రమోహన్ ఎదుట బైండోవర్ చేసింది. నాటుసారా తయారికి ఉపయోగించే నల్లబెల్లం, పటికలను విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎక్సైజు ఎస్సై హెచ్చరించారు. ఎక్సైజు పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట సమీపంలో బుధవారం బైక్‌ను బొలేరో వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహన సిబ్బంది ఈఎంటీ రాజేంద్రప్రసాద్, పైలట్ అమర్‌నాథ్‌లు అందించిన వివరాల ప్రకారం.. మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన బత్తిని చంద్రమౌళి స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలు దేరాడు. ఈ క్రమంలో చిల్పూరుగుట్ట సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొనడంతో చంద్రమౌళి బైక్ పైనుంచి ఎగిరి కిందపడడంతో రెండు కాళ్లు విరిగి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

విషగుళికలు తిని కోళ్ల మృత్యువాత

రఘునాథపల్లి: విష గుళికలు తిని ఎనమిది కోళ్లు మృత్యువాత పడిన సంఘటన మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సురావు నర్సింగరావు తన ఇంటి వద్ద కోళ్లను పోషిస్తున్నాడు. బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నర్సింగరావు ఇంటి ఎదుట విషగుళికలు వేసి వెళ్లారు. సాయంత్రం ఉన్నట్టుండి కోళ్లు కింద పడి మృతి చెందడంతో నర్సింగరావు ఆందోళనకు గురయ్యారు. గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేయడంతో తన కోళ్లు మరణించాయని నర్సింగరావు ఆరోపించారు.

ఉరేసుకుని ఆటో డ్రైవర్ ఆత్మహత్య



సందీప్‌గౌడ్(ఫైల్)

కొడకండ్ల: రంగాపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నలమాస సందీప్‌గౌడ్(26) మంగళవారం అర్ధరాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. నలమాస భిక్షపతి–పద్మ దంపతుల రెండో కుమారుడు సందీప్‌గౌడ్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అప్పుల బాధ తాళలేక అర్ధరాత్రి ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

నివాళి

బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తనకు వీరాభిమాని అయిన సందీప్‌గౌడ్ ఆత్మహత్య సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి దయాకర్‌రావు గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి ఆర్థికసాయం అందించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఏపీజీవీబీ ఇక టీజీబీ

● మేనేజర్ సమీర్‌కుమార్



మాట్లాడుతున్న సమీర్‌కుమార్

పాలకుర్తి: కేంద్ర నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఇక నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారనుందని స్థానిక బ్యాంకు మేనేజర్ ఎ.సమీర్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జనవరి 1వ తేదీ నుంచి ఏపీజీవీ బ్యాంకు టీజీబీగా చలామని అవుతుందని అన్నారు. బ్యాంకుల మార్పులో భాగంగా ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు అన్ని బ్యాంకింగ్ సేవలు నిలిచిపోతాయని తెలిపారు. ఖాతాదారులు గమనించి ఈనెల 27వ తేదీలోపు అత్యవసర బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించుకోవాలన్నారు. ఈ మార్పు సమయంలో కలిగే అసౌకర్యానికి చింతించకుండా రేపటి మెరుగైన సేవల కోసం సహకరించాలని మేనేజర్ కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కొడకండ్ల: మండలంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను బుధవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పరామర్శించారు. రామవరం, పెద్దబాయితండలో బాధిత కుటుంబాలను, నర్సింగాపురంలో తాటి చెట్టు పైనుంచి పడి గాయాలైన ముత్యం వెంకన్నలను ఆమె పరామర్శించారు. ఆమె వెంట బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, సురేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

కట్కూరులో..

బచ్చన్నపేట: కట్కూరు గ్రామానికి చెందిన పొట్టి చంద్రమ్మ అనారోగ్యంతో బుధవారం మృతిచెందింది. కాగా, దహన సంస్కారాల నిమిత్తం చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేతవెంకన్న రూ.5,000 పంపించగా గ్రామశాఖ అధ్యక్షుడు పుట్ట నర్సింహులు బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు ఉన్నారు.